క్లుప్తంగా

పెద్ద చెరువు అలుగు మరమ్మతులు షురూ..



పెద్ద చెరువు తూము మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న ఇరిగేషన్ అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

కల్లూరు: కల్లూరు పెద్దచెరువు అలుగు మరమ్మతులను బుధవారం ఇరిగేషన్ అధికారులు ప్రారంభించారు. సాక్షి దినపత్రిలో మంగళవారం 'ఆయకట్టు రైతుల అరిగోస'అనే కథనానికి స్పందించిన జలవనరుల శాఖ ఈఈ ఎం.లక్ష్మీనారాయణ, డీఈ రాజారత్నాకర్, ఏఈ ప్రసాద్‌లు పెద్ద చెరువు ఆయకట్టు వద్దకు చేరుకుని కూలీలతో తూము మరమ్మతు పనులు చేపట్టారు. రింగ్‌బండ ఏర్పాటు చేస్తున్నారు. విరిగిన షట్టర్‌ను తొలగించి కొత్తగా షట్టర్ ఏర్పాటు చేసి కాంక్రీట్ పనులు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. రైతులు తూము మరమ్మతు పనులకు సహకరించాలన్నారు.

ఆలయంలో విగ్రహాల ప్రతిష్ఠ

బోనకల్: మండలంలోని సాయిబాబా ఆలయం వద్ద బుధవారం ఆంజనేయ స్వామి విగ్రహాన్ని, శివలింగాన్ని ప్రతిష్ఠించారు. బుధవారం ఇంగువ రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో ఈ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం భక్తులకు అన్నదాన నిర్వహించారు.

రైలు ప్రమాదాలను నివారించండి

మధిర: ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి రైలు ప్రమాదాలను నివారించాలని దక్షిణ మధ్య రైల్వే డివిజనల్ మేనేజర్ అజయ్ కుమార్ గుప్తా తెలిపారు. మధిర రైల్వే స్టేషన్‌లో బుధవారం రైల్వే సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. ప్రయాణికులు రైల్వే పట్టాలు దాటకుండా చూడాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జి లను ఉపయోగించుకునే విధంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

రామాలయం పునర్నిర్మాణానికి శంకుస్థాపన

సత్తుపల్లి: పట్టణంలోని అయ్యగారిపేట రామాలయం పునఃనిర్మాణానికి వాస్తు సిద్ధాంతి వెల్లటూరి ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో బుధవారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యగారిపేట గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ, స్వీట్లు పంపిణీ

సత్తుపల్లి: సత్తుపల్లిలోని రామానగరం, తాళ్లమడ, నారాయణపురం గ్రామాల్లోని ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు ప్లాస్క్ వాటర్ బాటిల్, మజ్జిగ, స్వీట్ ప్యాకెట్లను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పంపిణీ చేశారు. వీటిని ఎంపీ బండి పార్థసారధిరెడ్డి, ఎమ్మెల్యే సండ్ర వారి సొంత ఖర్చులతో వీటిని అందించారు. పంపిణీ కార్యక్రమానికి సహకరించిన ఎంపీ బండి పార్థసారధిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హైమావతి, ఎంపీడీఓ సీహెచ్ సుభాషిణి, జెడ్పీటీసీ కూసంపూడి రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, ఆత్మకమిటీ చైర్మన్ వాసు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి మండల పల్లెప్రగతి నివేదిక పోస్టర్లను స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుభాషిణి, సర్పంచ్‌లు శ్రీనివాసరావు, తుంబ్మూరు సరస్వతి, కంచర్ల రమాదేవి, ప్రభాకర్, చెట్టుమాల రేణుక, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ ఏపీఓ బాబురావు, సిబ్బంది పాల్గొన్నారు.

పెండింగ్ సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న అజయ్‌కుమార్ గుప్తా

ఏన్కూరు: పెండింగ్‌లో ఉన్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని ట్రాన్స్‌కో చైర్‌పర్సన్ పి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ వినియోగదారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాచారం, మేడేపల్లి గ్రామల్లో విద్యుత్ సమస్యల గురించి ఫిర్యాదులు స్వీకరించారు. వాటిని తక్షణం పరిష్కారించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో సబ్ ఇంజనీర్ కిషోర్‌రెడ్డి పాల్గొన్నారు.

చదువు.. అందని ద్రాక్షేనా..?

కలగానే తల్లాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు

- భారంగా మారిన చదువులు
- దూరంగా ఉన్న కళాశాలలు
- మధ్యలోనే మానేస్తున్న విద్యార్థులు



కళాశాలకు అనుకూలంగా ఉన్న తల్లాడ జిల్లా పరిషత్ పాఠశాల భవనం

విద్య ద్వారానే దేశాభివృద్ధి చెందుతుందని, విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు పాలకులు పదే పదే చెబుతున్నా తల్లాడకు మాత్రం అందులో మొండి చేయి చూపిస్తోంది. నాలుగు దశాబ్దాలుగా ఇక్కడ జూనియర్ కళాశాల లేక ఎందరో విద్యార్థులు తమ చదువులను అర్ధాంతరంగా ఆపేస్తున్నారు. ఇప్పటికీ అదే పరిస్థితి నెలకొని ఉంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

తల్లాడ: మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సి ఉంది. సొంత మండలంలో ప్రభుత్వం జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులు కాలేజీ చదువులకు ఇతర మండలాలకు వెళ్లాల్సి వస్తుంది. తల్లాడ మండల విద్యార్థులు ఖమ్మం, వైరా ఇలా ఇతర ప్రాంతాలతో పాటుగా స్థానికంగా ఉన్న ప్రైవేట్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్నారు. దూర భారంతో కళాశాలలకు వెళ్లి రావడం వల్ల బస్సు చార్జీలు చెల్లించడంతో పాటు రాకపోకలకు అధిక సమయం వెచ్చించాల్సి వస్తోంది.

దూరం పంపలేక పొలం పనులకు..

తల్లాడలో ఆరు జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలు, ఒక ఎయిడెడ్ పాఠశాల, పలు ప్రైవేట్ విద్యాలయాలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ప్రతీ ఏటా ఇంటర్ మీడియట్ చదువు కొనేందుకు బయటి ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ప్రతి సంవత్సరం ఈ మండలం నుంచి 500 మంది విద్యార్థులు పదో తరగతి ఉత్తీర్ణులై ప్రైవేట్ కళాశాలలకు వెళుతున్నారు. ఆడపిల్లలను తల్లిదండ్రులు అంత దూరం పంపలేక పొలం పనులకు తీసుకెళుతున్నారు. మండలంలో కళాశాల ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ స్థలాలు కూడా ఉన్నాయి.

ఆక్రమణకు గురైన కళాశాల స్థలం..

40 ఏళ్ల క్రితమే తల్లాడ మండలం మల్లారం గ్రామ సమీపంలోని 170 సర్వే నంబరులో రెండెకరాల స్థలాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం కేటాయించింది. అయితే అప్పట్లో కళాశాల మంజూరు కాకపోవడంతో కొన్నేళ్లుగా ఖాళీగా ఉంది. దీంతో పలువురు మూడు దశాబ్దాల క్రితమే ఆ స్థలానిఆక్రమించికొని వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ సిబ్బంది ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసింది. వెంటనే రైతులు ఏళ్లగా వ్యవసాయం చేసుకుంటున్నామని కోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి కోర్టులో కేసు నడుస్తుంది. ప్రస్తుతం ఆ భూమిలో రైతులు వరిసాగు చేసుకుంటున్నారు.

కళాశాల ఏర్పాటుకు మంత్రులను కలిసిన పూర్వ విద్యార్థులు..

తల్లాడలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని పూర్వ విద్యార్థులు 2017లో అప్పటి రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, విద్యాశాఖా మంత్రి కడియం శ్రీహరిలను కలిసి సమస్యను వివరించారు. దీంతో ఇద్దరు మంత్రులు స్పందించిన మంత్రులు కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కానీ పలు సాంకేతిక సమస్యల కారణంగా అది సాధ్యం కాలేదు. అప్పటి నుంచి ప్రజాప్రతినిధులకు ఎన్నికల సమయంలోనే గుర్తు తెచ్చుకుని ఆ తర్వాత దాని ఊసే ఎత్తరు. తల్లాడలో కళాశాల ఏర్పాటు విద్యార్థులకు కలగానే మిగిలింది.

ఈ విద్యా సంవత్సరంలోనైనా ఏర్పాటు చేయాలి..



మల్లవరం సమీపంలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ స్థలం

ఈ విద్యా సంవత్సరంలోనైనా తల్లాడలో ప్రభుత్వ కళాశాల మంజూరు చేసి ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాల్లో భవనాలు నిర్మించాలని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. తాత్కాలికంగా షిఫ్ట్ పద్ధతిలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా కళాశాల ఏర్పాటు చేయవచ్చు. అధునాతన భవనాలతో జాతీయ రహదారి పక్కనే పాఠశాల ఉంది. ఉదయం హైస్కూల్ సెక్షన్, మధ్యాహ్నం నుంచి కళాశాల తరగతులు నిర్వహించేందుకు అనుకూలంగా ఉంది. హైస్కూల్ పక్కనే ప్రస్తుతం ఎన్నెస్పీ ఖాళీ స్థలం ఉంది. కావున పాలకులు కళాశాల మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

జూనియర్ కళాశాల అవసరం..



తల్లాడలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి. ఎప్పటి నుంచో ఈ ప్రాంత వాసులు ప్రభుత్వ జూనియర్ కళాశాల కోసం ఎన్నో అర్జీలు, విన్నపాలు పెట్టుకున్నారు. 2017లో పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రులను కలవగా కళాశాల మంజూరు చేస్తామని అప్పట్లో వాగ్దానం చేశారు. అయినా ప్రతి ఏటా అది అందని ద్రాక్షగానే మిగులుతుంది.

– నెమ్మకంటి దామోదరప్రసాద్, ఎంఈఓ, తల్లాడ

ఎక్కడికెళ్లి చదవాలి..



కళాశాల ఏర్పాటు చేస్తే ప్రభుత్వ పాఠశాల్లో చదివిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రభుత్వ పాఠశాలలో చదివే నా లాంటి పేద విద్యార్థులు ఎక్కడకు వెళ్లి చదవాలి. కనీసం ఈ ఏడాదైనా కళాశాల ఏర్పాటు అవుతుందని ఆశపడ్డాను. కానీ అది నెరవేరలేదు. ప్రభుత్వ కళాశాల లేక పోవడంతో పలువురి చదువులు అర్ధాంతరంగా ఆగిపోతున్నాయి.

– తమ్మిశెట్టి మురళి, పది పూర్తైన విద్యార్థి, తల్లాడ

హక్కులు కల్పించండి



ఆందోళన చేస్తున్న పోడు సాగుదారులు

కారేపల్లి: ఏళ్లుగా పోడు భూమిలో సాగు చేసుకుంటున్న మాకు హక్కులు కల్పించాలని మాణిక్యారం, ఎర్రబోడు ప్లాంటేషన్ పోడు బాధితులు తెలిపారు. బుధవారం కారేపల్లి ఫారెస్ట్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఫారెస్ట్ అధికారులు మాకు ప్రత్యామ్నాయం చూపిస్తామని మా పోడు భూమిలో ప్లాంటేషన్ ఏర్పాటు చేశారన్నారు. ఇప్పుడు మాపై అన్యాయంగా అక్రమ కేసులు బనాయిస్తున్నారని తెలిపారు. ప్రత్యామ్నాయం చూపించే వరకు పోడు ప్లాంటేషన్‌ను వదిలేసేదే లేదని తెగేసి చెప్పారు. విషయం తెలుసుకున్న ఎస్సై పుష్పాల రామారావు అక్కడకు చేరుకుని ఆందోళకారులతో మాట్లాడారు. బాధితులు తమకు న్యాయం చేయాలన్నారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ.. మాణిక్యారం, ఎర్రబోడు పంచాయతీలలో 38కుటుంబాలకు చెందిన 93మంది పోడు సాగు చేసుకొని జీవిస్తున్నారన్నారు. 2020లో ఫారెస్ట్ అధికారులు పోడు భూమిలో సగం ప్లాంటేషన్‌కు మిగతాది వ్యవసాయం చేసుకోవడానికి అని అంగికరించారు. ఈ క్రమంలో మిగతా వారి దగ్గర నుంచి కొంత భూమిని సేకరించి బాధితులకు ప్రత్యామ్నాయం చూపించకపోవడంతోనే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఇకనైనా ఫారెస్ట్ ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని, అక్రమ కేసులు ఎత్తివేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌ఓ సిద్దారెడ్డి, ఎస్సై రామారావులకు వినతులు అందించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సిద్దారెడ్డి మాట్లాడుతూ.. బాధితుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఇకపై పోడుప్రాంతంలో వేసిన ఫారెస్ట్ ప్లాంటేషన్ వద్ద ఉద్రిక్తతలు సృష్టించవద్దన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి నరేంద్ర, నాయకులు రామారావు, సీతారాములు, పోడు సాగుదారులు సరిత, కళావతి, అరుణ, సుగుణ, కౌసల్య, హరికిషన్, రమేష్, రమేష్, బిక్షం తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత

కల్లూరు: కల్లూరు అంబేడ్కర్‌నగర్‌లో బుధవారం రాత్రి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమం నిర్వహించారు. కళాజాతలో కళాకారులు నృత్యాలు, పాటల ద్వారా మూఢ నమ్మకాలు, మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలు, తాగుడు, జూదం, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్సై రఘు, ఏఎస్సైలు చారి, పుల్లారావు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కల్లూరు: ఎస్సీ గురుకుల విద్యాలయాల్లో మిగిలిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీలత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భర్తీకి జూన్ 15 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఉత్తీర్ణులైన పదోతరగతి విద్యార్థులు ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, ఒకేషనల్ కోర్సులలో ప్రవేశాలు పొందాలని కోరారు.

రేపు ఈజీఎస్ సామాజిక తనిఖీ ప్రజావేదిక

వైరారూరల్: వైరాలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 16వ తేదీన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 14వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కె. శ్రీదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 22 గ్రామ పంచాయతీల్లో 01.11.2019 నుంచి 31.03.2023 వరకు జరిగిన పనులను పరిగణలోకి తీసుకోని 06.06.2023 నుంచి 15.06.2023 వరకు తనిఖీ నిర్వహించి వచ్చిన అంశాలపై ప్రజావేదిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కారేపల్లి పెద్దమ్మతల్లి 6వ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కారేపల్లి: కారేపల్లిలో కొలువుతీరిన శ్రీపెద్దమ్మతల్లి ఆలయ 6వ వార్షికోత్సవ కార్యక్రమాలు బుధవారం ఘనంగా ప్రారంభమైయ్యాయి. తొలిరోజు గణపతి పూజా, పుణ్యాహవాచకం, ధ్వజారోహణ కార్యక్రమాలతో పాటు, గ్రామంలోని గ్రామదేవతలకు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం సత్సంగ సేవా రత్న వీరభద్రం గురువుచే ప్రత్యేక ప్రవచన కార్యక్రమాలు ఆధ్యాత్మిక చింతనను కలిగించాయి. ఈ కార్యక్రమాలలో భాగంగా.. 15 నుంచి 18 వరకు పలు కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహక చైర్మన్ మండెపూడి శ్రీనివాసరావు, ఆలయ అర్చకులు మల్లికార్జున శర్మ, నాగసాయిశర్మ, సురేష్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నీట్ ఫలితాల్లో సత్తాచాటిన రశ్మిత



రశ్మిత

సత్తుపల్లిటౌన్: దేశ వ్యాప్తంగా వైద్యా కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన 'నీట్'పరీక్షలో తెలుగు విద్యార్థిని టాప్ లేపింది. తెలంగాణలోని ఖమ్మంజిల్లా సత్తుపల్లికి చెందిన గండికోట లక్ష్మి రశ్మిత జాతీయ స్థాయిలో 52వ ర్యాంక్ సాధించింది. జాతీయ స్థాయి మహిళా విభాగంలో 12వ ర్యాంక్ సాధించగా, తెలంగాణ రాష్ట్రంలో 2వ ర్యాంక్ సాధించింది. దీంతో పట్టణ ప్రముఖులు ఆమెకు అభినందనలు తెలిపారు.

వాలీబాల్‌లో విజయకేతనం



మాగంటి మల్లేష్

కల్లూరు రూరల్: ఇండియన్ పసిఫిక్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఉత్తర్ ఖండ్‌రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరిగిన ఐదో నేషనల్ స్థాయి బాలుర అండర్17 వాలీబాల్ పోటీల్లో తెలంగాణ తరుపున మొదటి స్థానంలో కల్లూరు మండలం చండువట్ల గ్రామానికి చెందిన విద్యా మాగంటి మల్లేష్ నిలిచాడు. ఇప్పటి వరకు మూడు నేషనల్‌లో పాల్గొని ప్రథమ స్థాయిలో నిలిచాడు. ఇతను సత్తుపల్లి (తాళ్లమడ) గురుకుల పాఠశాలలో విద్య నభ్యసిస్తున్నాడు.

ఆరోగ్య తెలంగాణే సర్కార్ లక్ష్యం



వైరా: గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్, అడిషనల్ కలెక్టర్ స్నేహలత, మాజీ ఎమ్మెల్యే చంద్రావతి



సత్తుపల్లిటౌన్: వైద్య సిబ్బందిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

వైరా: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ పనిచేస్తున్నారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మొగిలి స్నేహలత అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా బుధవారం వైరాలోని కమ్మవారి కల్యాణ మండపంలో నిర్వహించిన వైద్య ఆరోగ్య దినోత్సవ వేడుకలకు వారు ముఖ్య అతిధులుగా హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన కంటి వెలుగు పథకం ద్వారా కోట్లాది మందికి కంటి చూపును ప్రసాదించడం జరిగిందన్నారు. అనంతరం గర్భిణులకు ప్రభుత్వం అందజేసిన న్యూట్రిషన్ కిట్లను అందించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖాధికారులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి రూ.12వేల కోట్ల బడ్జెట్..

సత్తుపల్లిటౌన్: ప్రజారోగ్యమే లక్ష్యంగా గతంలో రూ.4 వేల కోట్లు ఉన్న వైద్య, ఆరోగ్య బడ్జెట్‌ను తెలంగాణ ప్రభుత్వం రూ.12వేల కోట్లకు పెంచి ప్రాధాన్యత ఇస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. సత్తుపల్లిలోని శ్రీలక్ష్మీప్రసన్న ఫంక్షన్‌హాల్‌లో బుధవారం డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ టి.సీతారాం అధ్యక్షతన జరిగిన వైద్య ఆరోగ్య దినోత్సవం సభలో ఆయన మాట్లాడారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన వైద్య ఆరోగ్యశాఖా సిబ్బంది డాక్టర్ చింతా కిరణ్‌కుమార్, డాక్టర్ వినీష్ కృష్ణ, ఫార్మసిస్టులు సతీష్, రామకృష్ణ, సూపర్‌వైజర్ నర్సింహారావు, ఏఎన్‌ఎం రజిని, స్టాఫ్‌నర్సు కళావతి, ఆశా కార్యకర్త నాగేంద్ర తదితరులను ఘనంగా సత్కరించారు. ముందుగా ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో న్యూట్రిషన్ స్టోరేజ్ కేంద్రం, డీసీడీసీ డయాలసీస్ కేంద్రాలను ప్రారంభించారు. వంద పడకల ఆస్పత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. గర్భిణులకు న్యూట్రీషన్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఎంపీపీలు హైమావతి, అలేఖ్య, ఏరియా ఆస్పత్రుల సూపరింటెండెంట్‌లు డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, డాక్టర్ రమేష్, డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు కొత్తూరు ఉమా, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, వైద్యులు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

సత్తుపల్లిటౌన్: తపాలాశాఖ నూతనంగా మహిళలకు, ఆడపిల్లలకు అధిక వడ్డీతో ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సత్తుపల్లి సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ కె.ప్రవీణ్‌కుమార్ కోరారు. బుధవారం కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం అధిక వడ్డీతో తీసుకొచ్చిన ఈ పథకం కేవలం పోస్టల్ శాఖ మాత్రమే అందిస్తుందని తెలిపారు. ఈ సమావేశంలో సబ్ డివిజన్ మెయిల్ ఓవర్ సిర్ బి.చంటి, ఆర్.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

భద్రాద్రి డీపీఆర్‌ఓకి మాతృ వియోగం



సరస్వతి (ఫైల్)

కల్లూరు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డీపీఆర్‌ఓ శీలం శ్రీనివాస్ తల్లి సరస్వతి (72) మంగళవారం కొత్తగూడెంలో ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని స్వగ్రామం కల్లూరు తీసుకురాగా పలువురు ప్రముఖులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు శీలం శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో ఫోన్లో పరామర్శించి సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉద్యానశాఖ అధికారి జీనుగు మరియన్న, డీపీఓ రమాకాంత్, డీఆర్‌డీఓ మధుసూదనరాజు, మైనార్టీ వెల్ఫేర్ అధికారి సంజీవరావు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చిన్నప్పయ్య, మార్కెటింగ్ పర్యవేక్షకులు నరేందర్, సత్తుపల్లి ఎంపీఐ వెంకటపుల్లయ్య, ఖమ్మం జిల్లా రిటైర్డ్ ఆర్‌సీఓ పుల్లయ్య, ఎంఎల్‌సీ సీసీ సుమంత్, పీఆర్ డీఈ రాంబాబు, కేటీపీఎస్ డీఈ ఎంవీఎల్‌ఎన్ రవికుమార్, పాలిటెక్నిక్ లెక్చరర్ లక్ష్మణరావు, కొత్తగూడెం టీపీసీసీ సభ్యుడు సీతారాములు, కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మట్టాదయానంద్, నాయకులు సుధాకర్, డాక్టర్ రఘు, శ్రీను, సురేష్ పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ సేవలను వినియోగించుకోవాలి

చింతకాని: ఫిజియోథెరపీ సెవలను దివ్యాంగులందరూ వినియోగించుకోవాలని ఫిజియోథెరపీ వైద్యురాలు వల్లూరి వసంత అన్నారు. మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాలలో భవిత కేంద్రంలో మండల విద్యాశాఖాధికారి పర్యవేక్షణలో ఈ వైద్య సెవలను బుధవారం ప్రారంభించారు. ఈ శిబిరంలో ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సూర్యకుమారి, విజయ్‌భాస్కర్, ఐఈఆర్పీలు కృష్ణారావు, దస్లీ, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, భవిత కేంద్రం సంరక్షురాలు లలితకుమారి పాల్గొన్నారు.

పరామర్శ

చింతకాని: మండలంలోని బొప్పారం గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు సట్టు పుల్లయ్య కుటుంబ సభ్యులను అమ్మ ఫౌండేషన్ చైర్‌పర్సన్ మల్లు నందిని బుధవారం పరామర్శించారు. మృతిడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో నాయకులు గోపి, నాగార్జున్, నాగరాజు, రఫీ, మదార్‌సాహెబ్ పాల్గొన్నారు.

రవికుమార్‌కు పరామర్శ..

కారేపల్లి: చీమలపాడు ఘటనలో కాలు కోల్పోయి, ఖమ్మం ప్రధాన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న అంగోత్ రవికుమార్‌ను బుధవారం తెలంగాణ రాష్ట్ర ఇన్‌కంట్యాక్స్ కమిషనర్ లావుడ్యా జీవన్‌లాల్ పరామర్శించారు. అనంతరం రవికుమార్‌కు అంగవైకల్య (సదరం) ధృవీకరణ పత్రాన్ని ఆయనతో పాటు ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ వెంకటేశ్వరరావు అందజేశారు.

కేసు నమోదు

చింతకాని: మండలంలోని పాతర్లపాడు గ్రామానికి చెందిన మాతంగి ప్రకాశమ్మపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. ప్రకాశమ్మ ఇంటి ఎదురంగా ఉన్న వెంకటేశ్వర్లుతో వెపచెట్టు కొమ్మల విషయంలో వివాదం నెలకొంది. ఈ క్రమంలో అతనితో పాటు మరో ఇద్దరు వ్యక్తులు ఆమెను గాయపరిచారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యంపై..

చింతకాని: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన పరికపల్లి పుష్పావతి(48) అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. ఆ మహిళ కుటుంబంలో నెలకొన్న వివాదంతో ఈ నెల 7న అదృశ్యమైంది. ఆమె కోసం గాలించినా జాడ తెలియకపోవటంతో మహిళ పెద్ద కుమారుడు సాయికాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకన్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

ఏన్కూరు: మండలంలోని సూర్యతండాలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామంలో పేకాట ఆడుతున్నారని స్థానికులు సమాచారం మేరకు బుధవారం వారిని పట్టుకున్నారు. వారి దగ్గర నుంచి రూ.3 వేల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై బాదావత్ రవి తదితరులు తెలిపారు.

ప్రకృతివనం దగ్ధం

కల్లూరురూరల్: మండలంలోని కప్పలబంధం గ్రామంలో ఏర్పాటు చేసిన మెగా పల్లె ప్రకృతి వనంలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. చాలా మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి.

వేడుకగా సామూహిక అక్షరాభ్యాసాలు



మధిర: బంజారా కాలనీ పాఠశాలలో అక్షరాభ్యాసం చేస్తున్న దృశ్యం



సత్తుపల్లిలో..



కొణిజర్ల : తనికెళ్లలో అక్షరాభ్యాసం చేయిస్తున్న సర్పంచ్ మోహన్‌రావు, హెచ్‌ఎం శైలజ

మధిర: మధిర పట్టణంలోని బంజారా కాలనీ ప్రాథమిక పాఠశాలలో బుధవారం చిన్నారులకు వార్డు కౌన్సిలర్ ధరావత్ మాధవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మీరాజ్యం అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజు, ఎస్ఎంసీ చైర్మన్ కొండలరావు, అంగన్‌వాడీ టీచర్లు అమృత, విజయ పాల్గొన్నారు.

సత్తుపల్లిలోని పాతసెంటర్ పాఠశాలలో..

సత్తుపల్లి: సత్తుపల్లి పాతసెంటర్ ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్ ఆధ్వర్యంలో అక్షరాభ్యాస వేడుకలలు నిర్వహించారు. ఒకటో తరగతిలో చేరిన 62 మంది పిల్లలకు తల్లిదండ్రుల సమక్షంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగమణి, జయశ్రీ, లాల్ అహ్మద్, పవన్, నరసింహారావు, అంగన్‌వాడీ టీచర్లు భవాని, కృష్ణకుమారి, పద్మ, నిర్మల, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సదాశివునిపేట పాఠశాలలో..

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులకు బుధవారం సర్పంచ్ తుంబూరు సరస్వతి అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పలకలు, బలపాలు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తుంబూరు సత్యనారాయణరెడ్డి, ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు, ఆత్మకమిటీ డైరెక్టర్ వెంకటరామయ్య, ఉపాధ్యాయురాలు మాలతి ఉన్నారు.

రాజులదేవరపాడు పాఠశాలలో..

ఎర్రుపాలెం: మండలంలోని రాజులదేవరపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం దుద్దుకూరు లింగయ్య ఆధ్వర్యంలో చిన్నారులకు గ్రామ పంచాయతీ సర్పంచ్ వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వెంకటనారాయణ, ఉపసర్పంచ్ సుజాత, మాజీ సర్పంచ్ నరసింహారావు, ఉపాధ్యాయులు తిరుపతిరావు, వెంకటశ్రీనివాసరావు, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, విజయలక్ష్మి, మిడ్‌డే మీల్స్ వర్కర్ లక్కిరెడ్డి భవాని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తనికెళ్ల, లక్ష్మీపురం లోని ప్రాథమిక పాఠశాలల్లో..

కొణిజర్ల: మండలంలోని తనికెళ్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ చల్లా మోహన్‌రావు, లక్ష్మీపురంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు షేక్.కరామత్ అలీ, ఎస్ఎంసీ చైర్మన్ బానోత్ రవిచందర్‌లు చిన్నారులకు అక్షరాభ్యాసాలు చేయించారు. కార్యక్రమంలో తనికెళ్ల పాఠశాల హెచ్‌ఎం శ్రీరామల శైలజ, తనికెళ్ల కాంప్లెక్స్ హెచ్‌ఎం సూరీ, ఉపాధ్యాయులు జ్యోతి, జయరాజు, సీఆర్‌పీ సైదుబాబు అంగన్వాడీ టీచర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.